సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.28,400

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28,400, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.30, సరాసరిన రూ.35 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
28.6°/21.7°

జిల్లాలో సోమవారం తుపాను వాతావరణం నెలకొంది. చలి తీవ్రత కాస్త తగ్గింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

31 మండలాల్లో మోస్తరు వర్షం



పుట్టపర్తి అర్బన్: ఫెంగల్ తుపాను ప్రభావంతో రెండో రోజు సోమవారం కూడా జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జిల్లాలోని 31 మండలాల్లో వర్షపాతం నమోదైంది. ఎన్పీకుంట మండలంలో 19 మి.మీ, నల్లచెరువు 16.2, అమడగూరు 15.6, గాండ్లపెంట 14.4, తనకల్లు 14.2, కదిరి 12.2, అగళి 11.6, మడకశిర 10.2, చిలమత్తూరు మండలంలో 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక హిందూపురం మండలంలో 9.8 మి.మీ, తలుపుల 9.2, రొళ్ల 8.6, నల్లమాడ 7.8, పరిగి 7.6, ఓడీ చెరువు 7.4, లేపాక్షి 6.8, సోమందేపల్లి 6.4, పెనుకొండ 6.2, గోరంట్ల 6.2, గుడిబండ 4.8, ముదిగుబ్బ 4.4, పుట్టపర్తి 4, అమరాపురం 3.8, కొత్తచెరువు 3.2, రొద్దం 3.2, బుక్కపట్నం 3, ధర్మవరం 2.2, సీకేపల్లి 2.2, రామగిరి 1.8, కనగానపల్లి 1.6, బత్తలపల్లి మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఎం.అగ్రహారం విలేజ్ క్లినిక్‌కు జాతీయ గుర్తింపు

- ‘ఉత్తమ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్’గా ఎంపిక



ఎం.అగ్రహారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

తాడిమర్రి: మండలంలోని ఎం.అగ్రహారంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. ఇక్కడి వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలందించడంతో ‘ఉత్తమ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్’గా ఎంపికై ంది. నవంబర్ 22న విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నేషనల్ హెల్త్ సిస్టమ్ రీసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ) బృందం సందర్శించింది. ఎన్‌క్వాస్ కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు అందితున్న సేవలు, వైద్య ప్రమాణాలు, శుభ్రత, వ్యాధినిరోధక టీకాల పంపిణీ, దీర్ఘకాలిక రోగులకు అందిస్తున్న వైద్య సేవలు తదితర అంశాలను ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ బృందం పరిశీలించింది. అనంతరం బృందం సభ్యులు ఆస్పత్రికి 90.80 శాతం మార్కులు ఇచ్చి ‘ఉత్తమ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్’గా ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రికి సమాచారం అందించినట్లు వైద్యాధికారులు హరిత, గోవర్ధన్ నాయుడు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ విలేజ్ హెల్త్ క్లినిక్‌గా ఎంపిక కావడంపై వైద్యాధికారులతో పాటు హెల్త్ సూపర్ వైజర్ రామ్‌కుమార్, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్త హర్షవర్ధన్‌రెడ్డి, ఏఎన్‌ఎం లక్ష్మీకాంతమ్మలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అభినందించారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళాలివ్వండి

- కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు



సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: దేశ రక్షణకోసం పాటుపడే సైనికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విరాళాలివ్వాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప కలెక్టర్‌ను కలిసి సాయుధ దళాల పతాక నిధిపై చర్చించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లు, స్టిక్కర్లు, ఇతర ప్రచార సామగ్రిని కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. సాయుధ దళాల్లో పనిచేస్తున్న సైనికులు, మాజీ సైనికుల పునరావాస చర్యలు, అమర జవాన్ల కుటుంబాలను ఆదుకునేందుకు జిల్లా ప్రజలకు విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు. ఎస్‌బీఐ ఖాతా 62076956433 (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎ న్0021438)లో నేరుగా బ్యాంకులో విరాళం జమ చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, జిల్లా సైనిక సంక్షేమ శాఖ సీనియర్ సహాయకులు గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కొనుగోల



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న ఈ రైతు పేరు గోవిందరెడ్డి. కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామం. ఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేసిన గోవిందరెడ్డి విత్తనం నుంచి పంట ఇంటికి చేరే వరకు రూ.30 వేలకుపైగా ఖర్చు పెట్టాడు. నాలుగు రోజుల క్రితం వరి మడి కోశాడు. సుమారు 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, మంచి ధర లభిస్తే రూ.75 వేలకుపైగా ఆదాయం లభిస్తుందని ఆశపడ్డాడు. కానీ అతని ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. పంట చేతికందాక రెండు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో ధాన్యంపై ప్లాస్టిక్ పట్టలు వేసి మూసేశాడు. దీంతో వడ్లు మొలకలు వచ్చాయి. ప్రభుత్వం ఇంతవరకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, వ్యాపారులు మరీ దారుణంగా రేటు కడుతున్నారని గోవిందరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నాడు.

రైతు రెక్కల కష్టం వర్షార్పణం

- వరుస తుపాన్లతో రంగుమారిన ధాన్యం
- నేటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- క్వింటా వడ్లకు రూ.2 వేలు కూడా ఇవ్వని వ్యాపారులు
- పెట్టుబడులు కూడా దక్కడం లేదని అన్నదాత ఆందోళన



పుట్టపర్తి మండలం పెదపల్లి వద్ద కళ్లంలో ఉన్న వడ్లకు కవర్లు కప్పిన దృశ్యం

పుట్టపర్తి అర్బన్: రైతులపై వరుణుడు పగబట్టాడు. కీలకమైన సమయంలో ముఖం చాటేసి.. పంట ఇంటికొచ్చే సమయంలో విరుచుకుపడ్డాడు. దీంతో చేతికొచ్చిన పంటలన్నీ తడిసిపోయాయి. ఆదుకోవాల్సిన పాలకులూ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రంగుమారిందన్న సాకుతో దళారులు పంటకు దారుణమైన రేటు కడుతుంటే రైతు దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు.

మాటలతో సరి..

తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పినా... ఆచరణలో మాత్రం ఎక్కడా ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. గత నెలలో సుమారు 20 రోజుల పాటు వర్షాలు కురిసి 3,550 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో వేరుశనగ, మొక్కజొన్న, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తాజాగా కళ్లాలకు చేరిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ఫెంగల్ తుపాను నిండా తడిపేసింది. దీంతో ధాన్యం మొలకలు వచ్చి రంగుమారగా...రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ‘‘రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లో డబ్బు నేరుగా ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తాం’’ అని చెప్పిన కూటమి ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తుండగా..రైతులు గగ్గోలు పెడుతున్నారు. నేటి వరకూ కొనుగోలు కేంద్రాల ఊసే లేకపోవడంతో ఆశలు వదులుకున్నాడు. కనీసం అధికార పార్టీ ప్రజాప్రతినిధులైనా తమ కష్టాన్ని చూసి సాయం చేయాలని కోరుతున్నారు.

రూ.2 వేలకూ అడగని వ్యాపారులు..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాస్తా రంగు మారిన ధాన్యానికి ప్రైవేటు వ్యాపారులు ఇష్టానుసారం రేటు కడుతున్నారు. వడ్లు, మొక్కజొన్నలు కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఒకరిద్దరు ముందుకు వచ్చినా.. క్వింటాకు రూ.2 వేలకు మించి ఇవ్వడం లేదని, క్వింటా స్థానంలో 110, 115 కిలోలు తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిదీ తేమ శాతం లెక్కించి కొనుగోలు చేస్తున్నారని, అధిక తేమ శాతం ఉంటే ధాన్యం సేకరించలేమని చెప్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొంత మంది రైతులు నెల తర్వాత డబ్బులిచ్చినా పర్లేదు పంట తీసుకెళ్లండని ప్రాధేయపడుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం...వ్యాపారికి లాభం..

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వ్యాపారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. రైతుల వద్ద అతితక్కువకు ఉత్పత్తులు కొని ఎక్కువ లాభాలకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం తడిసిన ధాన్యాన్ని కొంటున్న వ్యాపారులు దాన్ని ఆరబెట్టి కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జిల్లాలో ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించలేదు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు రైతు కష్టం పట్టడం లేద. కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. అందరూ కలిసి రైతును మోసం చేస్తున్నారు.

– లక్ష్మీనారాయణరెడ్డి, రైతు, జగరాజుపల్లి

అనుమతులు రాలేదు

తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ప్రస్తుతం రైతుల వద్ద వరి, మొక్కజొన్న ఉత్పత్తులు ఉన్నాయి. త్వరలో కందులు ఇంటికి చేరుతాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేసే అవకాశం ఉంది. రెండు రోజుల్లో పూర్తి సమాచారం తెలుస్తుంది.

– గీతమ్మ, డీఎం, ఏపీమార్క్‌ఫెడ్

రీకౌంటింగ్‌కు 7వ తేదీ వరకూ అవకాశం

పుట్టపర్తి: రీకౌంటింగ్ కోరే ‘డైట్’ విద్యార్థులు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు. గత నెలలో నిర్వహించిన సప్లిమెంటరీ ఫలితాలు వెలువడ్డాయని, రీకౌంటింగ్‌కు కోరుకునే విద్యార్థులు 7వ తేదీలోపు రూ.500 చలానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం చలానాతో పాటు సంబంధిత అన్ని సర్టిఫికెట్లను విజయవాడకు పంపాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం డైట్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

8న ‘క్రీడా భారతి’ ఆన్‌లైన్ పరీక్ష

పుట్టపర్తి టౌన్: చైతన్య కష్యప్ ఫౌండేషన్ అందించే ‘క్రీడా భారతి’ అవార్డుల కోసం నిర్వహించే ఆన్‌లైన్ జ్ఞాన పరీక్ష ఈనెల 8వ తేదీన ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. 12 ఏళ్లు పైబడిన వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. మొత్తం 50 ప్రశ్నలు ఉంటాయని, ఇందుకు సమయం 25 నిమిషాలు ఉంటుందన్నారు. కంప్యూటర్, లాప్‌టాప్, ట్యాబ్, మొబైల్ ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్ష రాయవచ్చని సూచించారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి మొదటి బహుమతిగా ఒకరికి రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు (ఇద్దరికి) , మూడో బహుమతిగా రూ.25 వేలు (ఆరుగురికి), నాల్గో బహుమతిగా రూ.11 వేలు (11 మందికి) ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు http://kreedaabharati. org వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

వాహన్ పోర్టల్‌లోనే అన్ని సేవలు

హిందూపురం: ఇప్పటి వరకూ రవాణా సేవలు అందిస్తున్న ఈ–ప్రగతి https:// aprtacitizen. epragathi. org/#!/ index పోర్టల్‌ను డిసెంబర్ సాయంత్రం 6 గంటల నుండి నిలిపి వేస్తున్నామని, ఇక నుంచి రవాణా సేవలన్నీ ‘వాహన్’ పోర్టల్‌లోనే చేసుకోవాల్సి ఉంటుందని జిల్లా రవాణాశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని వాహనాల సేవల కోసం (꠰ꠤꠤꠤ) పోర్టల్‌ను ఉపయోగించాలని సూచించారు. (https:// vahan. parivahan. gov. in/ vahanservice/ vahan/ ui/ statevalidation/ homepage. xhtml) లింక్ ద్వారా కొత్త పోర్టల్‌లో సేవలు పొందవచ్చన్నారు.







ఓపీ నం. 4లో కనిపించని వైద్యులు, బయట వేచి ఉన్న రోగులు



ఓపీ నం.8లో ఖాళీగా కుర్చీలు, బయట రోగుల పడిగాపులు

ఓపిక లేదా సారూ?

అనంతపురం మెడికల్: అనంతపురం సర్వజనాస్పత్రిలోని వివిధ విభాగాల్లో వైద్యులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మెడిసిన్ ఓపీ(అవుట్ పేషంట్) నంబర్ 2, 3, సర్జరీ ఓపీ నంబర్ 8, చిన్నపిల్లల ఓపీ నంబర్ 4లో వైద్యుల నిర్లక్ష్యం తారస్థాయికి చేరిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విభాగాల్లో కనీసం పట్టుమని రెండు, మూడు గంటలు వైద్యులు ఉండటం లేదు. సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వచ్చారు. గంటకుపైగా క్యూలో నిల్చుని చీటీ తీసుకున్నాక ఆయా ఓపీ విభాగాలకు వెళ్లిన వారికి అక్కడ వైద్యులు కానరాకపోవడంతో నిరాశ చెందారు. వాస్తవంగా ప్రతి సోమవారం ఆస్పత్రిలో 2 వేల ఓపీ వరకు ఉంటుంది. వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు అందుబాటులో ఉండాలి. కానీ చాలా విభాగాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. పీజీలపై భారం మోపి నిర్లక్ష్యం చేస్తున్నారు. ఓపీలను పర్యవేక్షించాల్సిన రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు (ఆర్‌ఎంఓ) నిద్రమత్తులో ఉంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పథకాలు పక్కదారి పడితే కఠిన చర్యలు

- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ చేతన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ‘‘సంక్షేమ పథకాలు అర్హులకే అందాలి. ఎక్కడైనా పక్కదారి పట్టినా.. అనర్హులకు లబ్ధికలిగినా అధికారులపై కఠిన చర్యలు ఉంటాయి’’ అని కలెక్టర్ చేతన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 185 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,

ప్రత్యేక అధికారులంతా వారంలో ఒకరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, సమస్యలను గుర్తించడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలను దృష్టిలో ఉంచుకుని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆయా శాఖల అధికారులు నివేదికలు సమర్పించాలన్నారు. డ్వామా, ఐసీడీఎస్, జిల్లా పంచాయతీ శాఖల ఉన్నతాధికారులు తమ శాఖల పరిధిలో అమలు చేసే పథకాలపై నిత్యం సమీక్షి చేయాలన్నారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే సంబంధిత ఎంపీడీఓలు, సీడీపీఓలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో రైతుబజార్లు ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని, ఇందుకోసం తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో పనిచేయాలన్నారు. డిసెంబర్ 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గృహ నిర్మాణాలు చేసుకోవాలనుకునే వారు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఓ విజయ్ కుమార్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతి బాయి, ఎల్‌డీఎం రమణ కుమార్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అశ్వర్థనాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, డీఈఓ కిష్టప్ప, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూముల్లో పచ్చదండా!

- పంట భూమిలో మట్టిరోడ్డు వేసిన తెలుగు తమ్ముళ్లు
- పరిటాల కుటుంబం అండతో రామగిరిలో రెచ్చిపోతున్న నేతలు
- రూట్ మ్యాప్ లేకున్నా జేసీబీ వాహనాలతో రోడ్డు వేసిన వైనం
- శేషంపల్లి నుంచి సుద్దకుంటపల్లి వరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల భూముల్లో దౌర్జన్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం.. ఆందోళనలో రైతన్నలు





శేషంపల్లి కురుబ శ్రీరాములు సాగుచేసిన టమాట పంటలో వేసిన మట్టిరోడ్డు, రోడ్డు వేసే క్రమంలో వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేసిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి టీడీపీ నేతల దౌర్జన్యాలు, దుర్మార్గాలు అన్నీఇన్నీ కావు. వైఎస్సార్ సీపీ నేతలు, సానుభూతి పరులను లక్ష్యంగా చేసుకుని భౌతికదాడులు చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో తెలుగు తమ్ముళ్ల అకృత్యాలు పెచ్చు మీరిపోయాయి. తాజాగా ఓ గ్రామానికి రోడ్డు వేసేందుకు తెలుగు తమ్ముళ్లు ఏకంగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పంటలను ధ్వంసం చేశారు. పొలాల మధ్యలో మట్టిరోడ్డు వేశారు. ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడ్డారు.

వంశపారంపర్యంగా వచ్చిన భూముల్లో...

రామగిరి మండలం కుంటిమద్ది పంచాయతీ శేషంపల్లి గ్రామానికి చెందిన కురుబ చిదగొండ్ల శ్రీరాములు వంశపారపర్యంగా వచ్చిన 10.94 ఎకరాల్లో టమాట, వరి, వేరుశనగ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆదివారం టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ రంగయ్య తన అనుచరులతో కలిసి శ్రీరాములు పొలం వద్దకు వచ్చాడు. జేసీబీ వాహనాలతో టమాట పంటను ధ్వంసం చేయించాడు. అంతేకాకుండా పొలాన్ని చదును చేసి ఏకంగా మట్టి రోడ్డు వేయించాడు.

రూట్‌మ్యాప్ లేకున్నా...

శేషంపల్లి నుంచి సుద్దకుంటపల్లి వరకూ రెవెన్యూ రికార్డుల్లో రూట్‌మ్యాప్ లేదు. కానీ ఆ గ్రామాలకు రోడ్డు వేస్తున్నామంటూ టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పొలాలను చదును చేయిస్తూ మట్టిరోడ్డు వేయిస్తున్నారు. ఈ దుర్మార్గాన్ని శ్రీరాములు కుమారుడు నరేష్ అడ్డుకోగా అతనిపై దాడి చేశారు. శేషంపల్లి నుంచి సుద్దకుంటపల్లికి గతంలో రోడ్డు ఉండేదని, దాన్ని పునరుద్ధరిస్తున్నామని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. దీనిపై ఇప్పటికే కోర్టులో వివాదం నడుస్తోందని, అయినా టీడీపీ నాయకులు అవేమీ పట్టించుకోకుండా పచ్చని పంటలను నాశనం చేసి పొలాల్లో రోడ్లు వేస్తున్నారని వాపోయారు.

సుద్దకుంట పల్లిలోనూ...

సమీప గ్రామమైన సుద్దకుంటపల్లిలోని తిరుపాల్‌నాయక్ పొలంలోనూ టీడీపీ నేతలు సోమవారం జేసీబీ వాహనాలతో రోడ్డు వేశారు. ఇందుకోసం తిరుపాల్ నాయక్ సాగుచేసిన వేరుశనగ పంటను ధ్వంసం చేశారు. వాస్తవానికి ఎక్కడైనా రోడ్డు వేయాలంటే రెవెన్యూ, పంచాయతీ అధికారులు ముందుగా ఆయా గ్రామాలను సందర్శించి రూట్‌మ్యాప్ ఆధారంగా స్కెచ్ వేసి రోడ్డు వేస్తారు. కానీ ఇక్కడ మాత్రం అలాంటివేమీ లేకుండానే కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల పొలాల్లోనే వెళ్లేలా రోడ్డు నిర్మాణ చేపట్టారు. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. బాధితులు మొరపెట్టుకుంటున్నా...తమకేం తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు.



సుద్దకుంటపల్లి తిరుపాల్‌నాయక్ పొలాన్ని జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తున్న టీడీపీ..

రామగిరి మండలంలోని కుంటిమద్ది గతంలో ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతం. కానీ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ గ్రామ స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు గ్రామంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. దీంతో ఇప్పుడిప్పుడే ఆ గ్రామం ఫ్యాక్షన్ ప్రభావం నుంచి బయటపడుతోంది. గ్రామస్తులంతా వ్యవసాయ పనులు చేసుకుంటూ ప్రశాంత జీవనం గడుతున్నారు. అయితే పరిటాల కుటుంబం అండతో టీడీపీ నేతలు చేస్తున్న దౌర్జన్యాలతో మళ్లీ అలజడులు రేగే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికైనా టీడీపీ నేతలు ఇలాంటి దురాగతాలకు స్వస్తి చెప్పి అభివృద్ధి చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇసుక టిప్పర్ల పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. సోమవారం చిత్రావతి నది నుంచి వేర్వేరుగా టిప్పర్లలో ఇసుక తరలిస్తుండగా సమాచారం అందుకున్న ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆదేశాలతో బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్, సిబ్బంది అప్రమత్తమై గుమ్మల్ల కుంట క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మూడు టిప్పర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో సాఫ్ట్‌వేర్ కోర్సులు

పుట్టపర్తి: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులు. పూర్తి వివరాలకు 79815 41994లో సంప్రదించవచ్చు.

ప్రహరీ గేటు ఊడి పడి బాలుడి మృతి



మనోజ్ తేజ (ఫైల్)

కూడేరు: ప్రహరీ గేటు ఊడి మీద పడడంతో ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు... కూడేరు మండలం కలగళ్లకు చెందిన షేకన్న, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె పార్వతిని గార్లదిన్నె మండలం కొప్పలకొండకు చెందిన గోపాల్‌కిచ్చి వివాహం చేశారు. వీరికి నాలుగేళ్ల వయసున్న కుమారుడు మనోజ్ తేజ, రెండేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. ఆదివారం పిల్లలను పిలుచుకుని పార్వతి పుట్టింటికి వచ్చింది. సాయంత్రం పిల్లలతో కలసి ప్రహరీ గేటుతో ఆడుకుంటుండగా ఉన్నఫళంగా గేటు ఊడి మనోజ్‌పై పడింది. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం బాలుడు మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వివాదాల విశ్వరూపం



❐ తనకు పదోన్నతి కల్పించాలంటూ ఎస్కేయూలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ వర్సిటీ పెద్దలకు చాలా రోజుల నుంచి మొరపెట్టుకుంటున్నారు. అయితే, ఎన్ని సార్లు విన్నవించినా పెడచెవిన పెట్టడంతో విసిగి వేసారిన ఆయన ఇటీవల రిజిస్ట్రార్ సమక్షంలోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఎస్సీ కేటగిరీలో క్లియర్ వేకెన్సీ ఉన్నా అవకాశం కల్పించడం లేదని, సవాలక్ష నిబంధనలలో కొర్రీలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

❐ కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద ఆరు నెలలకోసారి వర్సిటీ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించాలి. అప్పుడే వారి జీతాలు పెరుగుతాయి. కానీ, ఈ విషయంపై వర్సిటీ పెద్దలు దృష్టి సారించకపోవడంతో ప్రొఫెసర్లు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇవే కాదు, వర్సిటీలో అనేక సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పైపెచ్చు వర్సిటీని వివాదాలకు కేంద్రబిందువుగా మార్చారు.

- ఎస్కేయూలో పడకేసిన పాలన
- యాజమాన్యం తీరుతో విసిగిపోతున్న ఉద్యోగులు, ప్రొఫెసర్లు
- ఇటీవల ఓ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం
- ప్రొఫెసర్లకు పదోన్నతుల కల్పనలోనూ అంతులేని నిర్లక్ష్యం
- సహాయ నిరాకరణ దిశగా ఆచార్యుల అడుగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పాలన పడకేసింది. రాష్ట్రంలో దాదాపు అన్ని వర్సిటీల్లోనూ సీఏఎస్(కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం) కింద పదోన్నతులు కల్పిస్తున్నా ఎస్కేయూలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. సీఏఎస్ పదోన్నతులకు ప్రస్తుతం వర్సిటీలో 15 మంది ప్రొఫెసర్లు నిరీక్షిస్తున్నారు. ఒక్కో దఫా ఐదుగురికి పదోన్నతులు కల్పించాల్సి ఉన్నా వర్సిటీ యాజమాన్యం పట్టించుకోవడం లేదు.

భగ్గుమంటున్న ప్రొఫెసర్లు

వర్సిటీ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంపై ప్రొఫెసర్లు భగ్గుమంటున్నారు. సీఏఎస్ నిర్వహించకుండా అవమానానికి గురి చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. పలు దఫాలు యాజమాన్యానికి వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోకపోవడంతో అదనపు పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేసి, సహాయ నిరాకరణ చేయాలని ప్రొఫెసర్లు నిర్ణయించారు. అప్పగించిన పదవులన్నింటినీ త్యజించి, కేవలం పాఠాలు చెబుతూ వర్సిటీ పాలనకు సహకరించకూడదని నిర్ణయించినట్లు తెలిసింది.

రిజిస్ట్రార్ పోస్టుపై వివాదం..

ఇప్పటి దాకా వర్సిటీల చరిత్రలో లేని విధంగా ఎస్కేయూలో ఒక సామాన్య ఉద్యోగికి రిజిస్ట్రార్ పదవిని కట్టబెట్టడంపైనా ప్రొఫెసర్లు గుర్రుగా ఉన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ లేదా డిప్యూటీ రిజిస్ట్రార్ కేడర్‌లో ఉన్న వారికి రిజిస్ట్రార్ పదవి అప్పగించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నా... ఓ రీసెర్చ్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌ను రిజిస్ట్రార్‌ను చేయడం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో వచ్చే పాలక మండలి సమావేశంలో దీనిపై ఫిర్యాదు చేయడానికి ప్రొఫెసర్లు సిద్ధమైనట్లు తెలిసింది. ప్రభుత్వం మాది అని చెప్పుకునే సామాజిక వర్గంవారికి కేటాయించాలని భావిస్తే.. ప్రొఫెసర్లలో అదే సామాజికవర్గం వారికి పదవి అప్పగించినా అభ్యంతరం లేదని ఓ సీనియర్ ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ పాలకమండలి సమావేశం ఆలస్యమైతే... కొత్త వీసీ వచ్చాక అయినా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్‌ను నియమించి తమపై పెత్తనం చెలాయిస్తే సహించబోమని స్పష్టం చేశారు.

సిబ్బంది పదోన్నతుల్లో వివక్ష..

టైం స్కేలు ఉద్యోగులకు క్యాడర్‌వైజ్ ప్రమోషన్లు ఇస్తున్నారు. జీతాలు పెంచకుండా కేవలం హోదాను అప్పగిస్తున్నారు. కానీ రెగ్యులర్ బోధనేతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో సవాలక్ష నిబంధనలు అడ్డు వస్తున్నాయి. బోధనేతర ఉద్యోగులకు 16 మందికి సోమవారం పదోన్నతులు కల్పించి.. తక్కిన వారికి కల్పించలేదు. దీంతో రెగ్యులర్ బోధనేతర ఉద్యోగులపై ఎందుకు వివక్ష చూపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడువు విధించి అప్పటిలోపు డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్ ఉత్తీర్ణత అయ్యేలా కోరవచ్చు. కానీ, అస్మదీయులు, తమకు అనుకూలమైన వారు ఉంటే నిబంధనలన్నీ పక్కనబెట్టి అందలం ఎక్కిస్తున్నారని, మిగిలిన వారిని ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'అధికార' పెత్తనం...

విశ్వవిద్యాలయంలో నిబంధనలు తోసిరాజని ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. వర్సిటీ ముఖద్వారం వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక గదిని ఎటువంటి టెండర్లు లేకుండా అక్రమంగా కేటాయించారు. ప్రతి షాపింగ్ గదిని అప్పగించేటప్పుడు తప్పనిసరిగా టెండర్లు పిలవాలి. అయితే, ఇందుకు విరుద్ధంగా టీఎన్ఎస్ఎఫ్ నాయకుడికి అప్పగించడం విమర్శలకు దారితీసింది. అధికార పార్టీ నేతలు సిఫార్సు చేస్తే చాలు నిబంధనలు పక్కనబెట్టేస్తున్నారు. ఇక.. వర్సిటీ ప్రాంగణంలోని జన్మభూమి క్యాంటీన్‌ను గతంలో టెండర్ ద్వారా దక్కించుకున్న వ్యక్తిని దౌర్జన్యంగా బయటకు పంపించారు. గత ఐదు నెలల నుంచి టీడీపీకి చెందిన ఓ నాయకుడు ఈ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. నాలుగు నెలల నుంచి క్యాంటీన్ అద్దె కట్టనప్పటికీ అడిగే వారే లేరు. నెలకు రూ.20 వేల అద్దె, కరెంట్ బిల్లు బాకీ ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు.

అధికార పార్టీ అడ్డాగా వర్సిటీ



అధికార పార్టీ నాయకుల అడ్డాగా ఎస్కేయూ మారింది. నిబంధనలను తుంగలో తొక్కుతూ అధికార పార్టీ నాయకుల సిఫార్సుల మేరకు వర్సిటీలోని జన్మభూమి క్యాంటీన్, మెయిన్‌గేట్‌లో ఉన్న షాపును కట్టబెట్టారు. పరీక్షల విభాగంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు లేవు. సీనియర్ ప్రొఫెసర్లకు సీఏఎస్ పదోన్నతులు, బోధనేతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి.

– దివాకర్ నాయక్, ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు

సమస్యలపై స్పందించడం లేదు



నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్‌ను నియామకం చేశారు. బోధనేతర ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడం లేదు. సర్టిఫికెట్లను సకాలంలో పంపడంలో పరీక్షల విభాగంలో కొందరు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పీహెచ్‌డీ వైవాలు పెండింగ్‌లో పెడుతున్నారు.

– పి. హేమంత్ కుమార్, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు, ఎస్కేయూ

బీదోళ్లపై భారం మోపితే ఎట్లయ్యా?

- విద్యుత్ ఛార్జీల పెంపుపై ట్రాన్స్‌కో ఏఈని నిలదీసిన మహిళ



ట్రాన్స్‌కో ఏఈని ప్రశ్నిస్తున్న అంజినమ్మ

గుంతకల్లు టౌన్: గతంలో రూ.వందల్లో వచ్చే కరెంటు బిల్లు ఈ ఐదు నెలలుగా రూ.వేలల్లో వస్తోందని, బీదోళ్లపై ఇలా భారం మోపితే ఎలాగంటూ ట్రాన్స్‌కో ఏఈని ఓ సామాన్య మహిళ నిలదీసింది. వివరాలు.... గుంతకల్లులోని 11వ వార్డులో నివాసముంటున్న అంజినమ్మ కూలి పనులతో జీవనం సాగిస్తోంది. ఏ రోజుకా రోజు పనికి పోతే తప్ప పూట గడవని స్థితి. ఇంట్లో ఓ ఫ్యాన్, రెండు బల్బులు, ఓ ఫ్రిడ్జ్ ఉంది. గతంలో విద్యుత్ వినియోగానికి సంబంధించి (విద్యుత్ సర్వీస్ నెం.7221201026009) నెలకు రూ.300 నుంచి రూ.500లోపు బిల్లు వచ్చేది. ఈ ఐదు నెలలుగా ప్రతి నెలా రూ.1,375 నుంచి రూ.1500 వరకూ బిల్లు వస్తోంది. దీంతో సోమవారం ట్రాన్స్‌కో కార్యాలయానికి చేరుకుని ఏఈ రవిచ్రందను నిలదీసింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకోవడం విశేషం. అయితే తనను ఏ పార్టీ వారూ పిలవలేదని, కానీ, జగనన్న హయాంలో ఇంత పెద్దమొత్తంలో కరెంటు బిల్లులు ఏనాడూ రాలేదని అంజినమ్మ తెలిపింది. ఐదారు నెలలుగా కరెంట్ బిల్లు ఎందుకు ఎక్కువ వస్తుందో అడిగేందుకు వచ్చానని, బీదోళ్లపై ఇంతటి భారం వేస్తే బతికేది ఎట్లా? అంటూ ప్రశ్నించింది. కాగా, అంజినమ్మ అడిగిన ప్రశ్నలకు ఏఈ సమాధానం ఇవ్వలేక ఇబ్బంది పడ్డారు.

ఒక్క నెల ఇంటి బిల్లు రూ.860!

కుందుర్పి: మండలంలోని తూముకుంట గ్రామానికి చెందిన గంగాధర ఇంటికి విద్యుత్ బిల్లు ఏకంగా రూ.860 వచ్చింది. ఇది చూసిన గంగాధర్ అవాకయ్యారు. తన ఇంట్లో 3 బల్బులు మాత్రమే ఉన్నాయని, ప్రతి నెలా రూ.200 నుంచి రూ.250లోపే బిల్లులు వచ్చేవని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కానీ, నవంబర్‌కు చెందిన బిల్లు మాత్రం రూ.860 ఎలా వచ్చిందో చెప్పాలంటూ ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నించారు. అయితే తమకేమీ తెలియదని, మీటర్ రీడింగ్‌లో వచ్చిన మేరకు బిల్లులు అందజేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. బిల్లు చెల్లించకపోతే కరెంట్ తొలగిస్తామని హెచ్చరించారు.

• భిక్షకు నేనూ సై



మడకశిర: అయ్యప్ప మాలధారులతో కలసి ఓ వానరం భిక్ష (భోజనం) స్వీకరించిన అరుదైన ఘటన మడకశిర నగర పంచాయతీ పరిధిలోని వడ్రపాళ్యంలో ఉన్న రామ మందిరంలో చోటు చేసుకుంది. సోమవారం మధ్యాహ్నం దాతల సహకారంతో ఆలయంలో అయ్యప్ప మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అయ్యప్ప మాలధారులు భోజనం చేస్తుండగా ఓ వానరం అక్కడకు చేరుకుని వారి విస్తర్లలోని ఆహార పదార్థాలను రుచి చూసింది. ప్రత్యేకించి రామమందిరంలో చోటు చేసుకున్న అరుదైన దృశ్యాన్ని చూసిన స్థానికులు ఇది స్వామి మహిమ అంటూ కొనియాడారు.

ముగిసిన రైల్వే ఎన్నికల ప్రచారం

గుంతకల్లు/గుత్తి: ఈ నెల 4, 5, 6వ తేదీల్లో జరగనున్న రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సంబంధించి ప్రచారానికి సోమవారంతో తెర పడింది. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్య ప్రధాన పోటీ నెలకొనగా ఆయా సంఘాల నాయకులు పోటాపోటీగా ప్రచారం చేశారు. కాగా, 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను డివిజనల్ ప్రిసైడింగ్ ఆఫీసర్ యు.సుధాకర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ జయశంకర్ చౌహాన్ పూర్తి చేశారు. డివిజన్ వ్యాప్తంగా దాదాపు 34 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తుతో పాటు 185 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డివిజన్ వ్యాప్తంగా 14,453 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందితోపాటు రన్నింగ్ స్టాఫ్, టిక్కెట్ చెకింగ్, రక్షణ విభాగంలో సిబ్బంది ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చు.

యువతి అదృశ్యం

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లికి చెందిన యువతి గంగాదేవి కనిపించడం లేదు. ఆదివారం రాత్రి ఇల్లు విడిచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: డీఎస్సీ ఉచిత శిక్షణలో భాగంగా ఖాళీగా సీట్లను అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ అభ్యర్థులతో భర్తీ చేస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 08554–275575, 77990 43773లో సంప్రదించాలని కోరారు.

బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక బసవేశ్వర నగర్‌లో నివాసముంటున్న బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... విశ్రాంత ఉద్యోగి ప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం తన ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి వెనుక వైపు ఉన్న తలుపు నుంచి లోపలకు చొరబడి బీరువాలోని 4 తులాల బంగారం, 2 కిలోల వెండిని అపహరించారు. ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకున్న ప్రసాద్... చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి

- సిబ్బందిని ఆదేశించిన ఎస్పీ రత్న
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 35 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని ఎస్పీ రత్న హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 35 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని వాటికి సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖాతా నుంచి నగదు అపహరించారు..

తన భర్త బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు నగదు అపహరించారని, ఈ విషయంగా ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదంటూ ఎస్పీ ఎదుట సీఆర్‌పీఎఫ్ జవాన్ భార్య వాపోయింది. వివరాలు... పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన ప్రమీలాబాయి, శ్రీరామ్‌నాయక్ దంపతులు. సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా పంజాబ్‌లో పని చేస్తున్న శ్రీరామ్ నాయక్ దీపావళి పండుగ సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి స్వగ్రామానికి వచ్చాడు. ఆ సమయంలో జియో కంపెనీ నుంచి ఫోన్ చేస్తున్నామని, రూ.10తో రీ చార్జ్ చేసుకుంటే రూ.వెయ్యి ఆదా అవుతుందని అవతలి వ్యక్తులు తెలిపి, ఓ లింక్ పంపారు. వారి మాటలు నమ్మి లింక్ నొక్కిన అనంతరం అందులో అడిగిన వివరాలను నమోదు చేస్తూ వచ్చారు. శ్రీరామ్‌నాయక్ బ్యాంక్ ఖాతాలో నుంచి విడతవారీగా రూ.6.79 లక్షల నగదు అపహరణకు గురైనట్లు రెండు రోజుల తర్వాత తెలుసుకుని వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ తమకు ఎలాంటి సమాచారం లేదని ఎస్పీ రత్న ఎదుట బాధితురాలు ప్రమీలాబాయి వాపోయింది. స్పందించిన ఎస్పీ వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులతో మాట్లాడారు. శ్రీరాంనాయక్ ఖాతా నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన 8 మంది ఖాతాలకు నగదు బదిలీ అయిందని, ఈ కేసు దర్యాప్తులో ఉన్నట్లుగా తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సొమ్మును తిరిగి తెప్పించే ప్రయత్నం చేస్తామని ఎస్పీ భరోసానిచ్చారు.

హెచ్‌ఎం సస్పెన్షన్ సబబు కాదు : ఎస్టీయూ

అనంతపురం ఎడ్యుకేషన్: మడకశిర మండలం ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం సబబు కాదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 8వ తరగతి విద్యార్థి చేతన్‌ను పాఠశాల విరామ సమయంలో బంధువు వచ్చి పిలుచుకెళ్లాడని పేర్కొన్నారు. ఆ తర్వాత చేతన్ దారుణహత్యకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. అయితే ఎలాంటి సంబంధం లేని పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. విరామ సమయంలో విద్యార్థి మేనమామ వచ్చి బాలుడి ఇష్టపూర్వకంగా, ఎలాంటి ప్రతిఘటన లేకుండా పిలుచుకెళ్తే టీచర్లు ఎలా బాధ్యులవుతారన్నారు. 438 మంది విద్యార్థులున్న పాఠశాలకు కనీస బోధనేతర సిబ్బంది ఒకరూ లేకపోవడం, అన్ని పనులూ హెచ్‌ఎం, ఉపాధ్యాయులే చేసుకుంటుండడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇటీవల అపార్ అప్‌డేషన్ టార్గెట్ పెట్టడంతో హెచ్‌ఎం, టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదో తరగతి నామినల్ రోల్స్ పని ఒత్తిడిలోనూ ఉన్నారన్నారు. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆమిదాలగొంది స్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పీఈటీకి ఇచ్చిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.

బాలుడి హత్య కేసులో హెచ్‌ఎం, సిబ్బందిని బాధ్యులను చేయొద్దు

పుట్టపర్తి: మడకశిర మండలం ఆమిదాలగొంది పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చేతన్ కిడ్నాప్, హత్య కేసులో ఆ పాఠశాల హెచ్‌ఎం, సిబ్బందిని బాధ్యులను చేయడం సరికాదని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, అన్నారు. బాలుడి హత్య ఘటనను వారు ఖండిస్తూ గౌరవాధ్యక్షుడు భూతన్న, ఉపాధ్యక్షుడు బాబు, నాయులు సీతామహలక్ష్మి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, మారుతి తదితరులతో కలసి సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి బంధువులమని చెప్పి మేనమామ ఇంటర్వెల్ సమయంలో బాలుడి ఇష్టపూర్వకంగానే బయటకు పిలుచుకెళ్లారని అన్నారు. అయితే విద్యార్థిని కిరాతకంగా హతమారుస్తారని ఎవరూ ఊహించలేదన్నారు. బాలుడి కిడ్నాప్ ఉదంతంలో హెచ్‌ఎంను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేయడం సరికాదన్నారు. 438 మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలకు తగినంత మంది పీఈటీలను నియమించక పోవటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి సస్పెన్షన్ ఎత్తి వేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

గార్లదిన్నె: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన తిరుపాల్, సుంకమ్మ దంపతుల కుమారుడు నాగరాజు (28) తమకున్న 3.85 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంట పెట్టుబడులు కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశాడు. అయితే పంటలు సక్రమంగా పండక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలంటూ మదన పడుతూ తమకున్న భూమిలో 3 ఎకరాలను అమ్మి కొంత మేర అప్పులు చెల్లించాడు. అయితే వ్యవసాయం పనులు కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు సంబంధించి కంతులు రూ.3 లక్షలు కట్టలేకపోవడంతో ఆ వాహనాన్ని ఫైనాన్స్ కంపెనీ వారు లాక్కెళ్లారు. ఇంకా దాదాపు రూ.15 లక్షల మేర ఉన్న అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక తీవ్ర మనోవేదనకు లోనైన నాగరాజు సోమవారం ఉదయం తమ చీనీ తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న సీఐ కౌలుట్లయ్య, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు.


తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న పిల్లలు

హిందూపురం టౌన్: సంస్కృతికి పట్టం కడుతూ హిందూపురంలోని విద్యారణ్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం మాతాపితృ వందనం, మాతృ హస్తేన భోజనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పిల్లలు పాదపూజ చేశారు. అనంతరం తల్లిదండ్రులు స్వహస్తాలతో పిల్లలకు భోజనం తినిపించారు. తల్లిదండ్రులను పూజించడం, పెద్దలను గౌరవించడం పిల్లలకు చిన్నప్పటి నుంచి అలవాటు కావాలని వక్తలు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు కట్ట రత్నయ్య, కార్యదర్శి జయప్రకాష్, ప్రధానాచార్యులు సుబ్రహ్మణ్యం, బద్రీనాథ్, బాలాజీ, దేవాంగం శంకరప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈ దౌర్జన్యం ఇంకెన్నాళ్లు?



దౌర్జన్యంగా బండలను పగులగొడుతున్న టీడీపీ కార్యకర్తలు (ఫైల్)

అనంతపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బుక్కరాయసముద్రం మండలంలో టీడీపీ నేతల దౌర్జన్యాలు పెచ్చుమీరాయని, ఈ దౌర్జన్యాలను ఇంకెన్నాళ్లు భరించాలంటూ ఎస్పీ జగదీష్‌ను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ప్రశ్నించారు. బీకేఎస్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటనారాయణరెడ్డి ఇంటిపై ఆదివారం టీడీపీ నాయకుడు నాగరాజు, ఆయన అనుచరులు చేసిన దాడిని ఖండిస్తూ ఎస్పీని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో బండలను దౌర్జన్యంగా ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పెద్ద సంఖ్యలో ఉన్న పోలీసులు సైతం చోద్యం చూశారు తప్ప దౌర్జన్యాన్ని అడ్డుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో బాధిత వెంకటనారాయణరెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, శివకోటిరెడ్డి, సురేష్ ఉన్నారు.